క్లుప్తంగా

ముగిసిన సమ్మర్ కోచింగ్ క్యాంప్



సమ్మర్ కోచింగ్ క్యాంప్‌లో పాల్గొన్న చిన్నారులు

డోన్: స్థానిక బుగ్గన శేషారెడ్డి ఇండోర్ స్టేడియంలో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో మే 1 ప్రారంభమైన సమ్మర్ సెటిల్ బ్యాడ్మింటన్ కోచింగ్ క్యాంప్ శనివారం ముగిసింది. శుభం విల్లాస్ అధినేతలు ప్రశాంత్, అర్జున్ రెడ్డి సహకారంతో చివరి రోజు కోచింగ్ క్యాంపులో పాల్గొన్న చిన్నారులకు టోర్నమెంట్ నిర్వహించారు. అనంతరం విజేతలకు మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, రాయలసీమ యూనివర్శిటీ ఈసీ సభ్యుడు నాగభూషణం రెడ్డిలు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు సుభాన్, సూరి, బచ్చు చక్రి, కోచ్ నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

నేడు పూర్వ విద్యార్థుల సమ్మేళనం

డోన్ టౌన్: స్థానిక షాదీఖానా ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఉదయం 10 గంటలకు పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పూర్వ విద్యార్థులు తెలిపారు. ఎస్కేపీ హైస్కూల్లో 1993–94 10వ తరగతి బ్యాచ్ విద్యార్థులు హాజరు కావాలని కోరారు. పరిచయ కార్యక్రమంఅనంతరం విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానిస్తామన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

బేతంచెర్ల: రవాణా రంగంలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని లారీ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు కోరారు. స్థానిక లారీ వర్కర్స్ యూనియన్ కార్యాలయంలో యూనియన్ అధ్యక్షుడు ఎల్లయ్య అధ్యక్షతన కార్మికులతో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం రవాణా రంగంలో తెచ్చిన మోటార్ వాహన చట్టంతో రవాణా కార్మికుల పరిస్థితి దుర్భరంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. ట్రాన్స్‌పోర్ట్ కార్మికులకు నష్టం కల్గించే జీవో నంబర్ 21 రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

విజ్ఞానాన్ని పెంచుకోవాలి

బేతంచెర్ల: ప్రతిఒక్కరూ గ్రంథాలయాలను సందర్శించి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని గ్రంథాలయ అధికారి మధు శేఖర్ పిలుపునిచ్చారు. స్థానిక గ్రంథాలయంలో మే8న ప్రారంభమైన విద్యార్థులకు వేసవి విజ్ఞాన శిబిరం శనివారం ముగిసింది. ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. గ్రంథాలయాల అవశ్యకతను ఈ సందర్భంగా మధుశేఖర్ విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పుల్లం రాజు, వ్యాపార వేత్త తిమ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలకు విద్యార్థులు ఎంపిక

బేతంచెర్ల: మండలంలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామంలోని వాసు విద్యా నికేతన్‌కు చెందిన ఐదుమంది విద్యార్థులు ఐదవ తరగతి గురుకుల ప్రవేశ పరీక్షలో ప్రతిభ కనబరిచినట్లు పాఠశాల కరస్పాండెంట్ హుసేన్ తెలిపారు. అఖిల్ కుమార్ కర్నూలు గురుకుల పాఠశాలకు, మహేశ్వరి – నెరవాడ, గాయత్రి, లక్ష్మి సుధ – ఆళగడ్డ, జయశ్రీ కంబాలపాడు గురుకుల పాఠశాలకు ఎంపికైనట్లు ఆయన వివరించారు.

మౌలిక వసతుల కల్పనకు చర్యలు



డ్రైనేజీ కాల్వ పనులను పరిశీలిస్తున్న ఎంపీపీ

బేతంచెర్ల: మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి చొరవతో గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని తవిసికొండ గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. నాణ్యతగా చేపట్టాలని కంట్రాక్టర్‌కు సూచించారు. దశలవారీగా గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాల్వలు, ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణం చేపడుతున్నట్లు ఎంపీపీ తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బండికాటి వెంకటేశ్వర్‌రెడ్డి, గూనినాగరాజు, తిరుమలేశ్వర్ రెడ్డి, రామనాయుడు, వాల్మీకి ఫెడరేషన్ డైరక్టర్ మురళీకృష్ణ పాల్గొన్నారు.

నేడు లైబ్రరీ నిర్మాణానికి మంత్రి బుగ్గన భూమి పూజ

బేతంచెర్ల: పట్టణంలోని సబ్ రిజిష్టర్ కాలనీ సమీపాన రూ. 40 లక్షలతో నూతనంగా నిర్మించే డిజిటల్ లైబ్రరీ నిర్మాణానికి ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ఆదివారం భూమి పూజ నిర్వహిస్తారని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి శనివారం తెలిపారు. పట్టణ ప్రజలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

భవితకు బంగారు కానుక సిద్ధం!

- రేపు స్కూళ్ల పునఃప్రారంభం
- అదేరోజే విద్యార్థులకు విదాకానుక కిట్ల పంపిణీకి చర్యలు
- ఇప్పటికే పాఠశాలలకు చేరిన కిట్లు



పాఠ్యపుస్తకాలను సర్దుతున్న సిబ్బంది

అవుకు: విద్యారంగానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతిస్తుంది. పేద విద్యార్థుల బంగారు భవిష్యత్తే ధ్యేయంగా బంగారు కానుకల్లాంటి పథకాలను అమలు చేస్తూ ముందుకు సాగుతుంది. కార్పొరేటు పాఠశాలలకు ధీటుగా నాడు–నేడు పథకం కింద ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతోంది. పిల్లలను బడికి పంపే ఏ తల్లీ ఆర్థిక ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం అమ్మఒడి పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న విషయం తెలిసిందే. అదేవిధంగా ఉన్నత విద్యనభ్యశించే విద్యార్థులకు ప్రభుత్వం అండగా నిలుస్తుంది. విద్యా, వసతి దీవెలను అందజేస్తూ ఆదుకుంటుంది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం. ఈ నేపథ్యంలో 12వ తేదీన పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. అదేరోజే ప్రతి విద్యార్థికి జగనన్న విదాకానుక కిట్ల పంపిణీ ప్రారంభించేందుకు ఉపాధ్యాయులు చర్యలు తీసుకుంటున్నారు. మండల కేంద్రం అవుకులో స్టాక్ పాయింట్‌గా ఏర్పాటు చేసిన జిల్లా పరిషత్ బాలికల పాఠశాలకు నెలరోజుల ముందు నుంచే విద్యాకానుకలు ఒక్కొక్కటిగా చేరాయి. రెండోవిడత పుస్తకాలు నాలుగైదు రోజుల్లో రానున్నాయి. అక్కడ సిద్ధంగా ఉన్న విద్యాకానుకలను అధికారులు పరిశీలించి పాఠశాలలకు సరఫరా చేస్తున్నారు. ఈ మేరకు అన్ని పాఠశాలలకు కిట్లు చేరాయి.

అవుకులో 4525 మంది విద్యార్థులకు కిట్లు..

అవుకు మండలంలోని 49 ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 4525 మంది విద్యార్థులకు జగనన్న విద్యాకానుకలు అందనున్నాయి. పాఠశాల ప్రారంభం రోజే విద్యార్థులకు జగనన్న విద్యాకానుక పంపిణీ ప్రారంభించనున్నారు ఉపాధ్యాయులు. మండలంలోని అన్ని పాఠశాలలకు సంబంధించి ఇప్పటి వరకు 27,415, వర్క్ బుక్‌లు 5,523, నోట్ పుస్తకాలు 15,106 వచ్చాయని సంబంధిత అధికారులు తెలిపారు. అలాగే 1 నుంచి 5వ తరగతి వరకు 366 పిక్టోరియల్ నిఘంటువులు, 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు 453 ఆక్స్‌ఫర్డ్ నిఘంటువులు వచ్చాయన్నారు. బెల్టులు, షూస్, సాక్స్‌లు, ఒక్కో విద్యార్థికి మూడు జతల చొప్పున 4525 మంది విద్యార్థులకు పూర్తిస్థాయిలో వచ్చాయని అధికారులు తెలిపారు.

విద్యా కానుక పేద విద్యార్థులకు వరం



ప్రభుత్వం పేద విద్యార్థులకు అందిస్తున్న విద్యాకానుక వరం లాంటిది. కార్పొరేటు స్కూళ్ల విద్యార్థులకు ధీటుగా నాణ్యమైన దుస్తులు, బూట్లు, సాక్స్‌లు, పాఠ్య, నోట్ పుస్తకాలు, ఆకర్షణీయమైన స్కూల్ బ్యాగ్, బెల్టులు, ఇంగ్లిష్‌లో ప్రావీణ్యం సాధించేందుకు నిఘంటువులను అందజేయడం హర్షించదగ్గ విషయమన్నారు. నాడు–నేడు పథకంతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారిపోయాయి. ప్రభుత్వ విద్యారంగానికి ప్రాముఖ్యతనిస్తున్నందున పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగింది.

– ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డి

మొదటి రోజే విద్యా కానుక పంపిణీ..



వేసవికాల సెలవుల అనంతరం ఈ నెల12న అన్ని ప్రభుత్వ పాఠశాలలు తెరుచుకోనున్నాయి. అదేరోజునే పాఠశాలలోని విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లను పంపిణీ చేస్తాం. మొదటిరోజే విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తే ఆ సంతోషం వేరు. ఇప్పటికే విద్యాకానుకకు సంబంధించి మండల కేంద్రానికి చేరిన కానుకలను ఆయా పాఠశాలలకు తరలించాం. మండలంలోని 49 ప్రభుత్వ పాఠశాలల్లోని 4,525 మందికి విద్యా కానుకను అందిస్తాం.

– ఎంఈఓ శ్రీధర్ రావు

క్రైం కార్నర్

పాముకాటుకు మహిళ మృతి



మృతి చెందిన గొల్ల లీలావతి

అవుకు: మండల పరిధిలోని మెట్టుపల్లెలో పాము కాటుకు గురై ఓ మహిళ మృతి చెందిందని ఏఎస్ఐ సుబ్రహ్మణ్యం శనివారం తెలిపారు. గ్రామానికి చెందిన గొల్ల వివాహిత లీలావతి(51) ఈనెల 7న తన పొలంలో వరిగడ్డిని ట్రాక్టర్‌కు లోడ్ చేయడానికి వెళ్లింది. వరిగడ్డితో ఉన్న నాగుపాము ఆమె కుడిపాదంపై కాటు వేసింది. స్థానికులు వెంటనే బనగానపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందింది. మృతురాలి భర్త గొల్ల రమణయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసామని ఏఎస్ఐ తెలిపారు.

న్యూసెన్స్ కేసు నమోదు

డోన్ టౌన్: పట్టణంలో ఇతరులకు ఇబ్బందికరంగా అధిక సౌండ్‌తో డీజే పెట్టుకుని పెళ్లి సంబరాలు చేసుకుంటుండగా న్యూసెన్స్ కేసు నమోదు చేసినట్లు పట్టణ పోలీసులు శనివారం తెలిపారు. శుక్రవారం రాత్రి పెళ్లి ఊరేగింపులో భాగంగా డీజే అధిక శబ్దాలు చేస్తుండటంతో స్థానికులు 100 నంబరుకు ఫిర్యాదు చేశారని తెలిపారు. ఈ మేరకు పట్టణ పోలీసులు వెళ్లి డీజే వాహనాన్ని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు.

ఎస్సార్‌బీసీ ఆయకట్టుకు నీరు విడుదల చేయాలి



ఎస్సార్‌బీసీ ప్రధాన కాల్వ

బనగానపల్లె: ఎస్సార్‌బీసీ ఆయకట్టుకు నీటిని విడుదల చేయాలని మొక్కజొన్న సాగుచేసే రైతులు కోరుతున్నారు. బనగానపల్లె నియోజకవర్గంలో ఎస్సార్‌బీసీ ఆయకట్టు అధికారుల లెక్కల ప్రకారం సుమారు 72వేల ఎకరాలు ఉంది. ఎస్సార్‌బీసీకి అనుసంధానంగా ఉన్న గోరుకల్లు రిజర్వాయర్ అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఈ అభివృద్ధి పనులకు ఇబ్బందిలేకుండా ఎక్కువగా ఉన్న నీటిని ఎస్సార్‌బీసీ ప్రధాన కాల్వ ద్వారా 300 టీఎంసీల నీటిని విడుదల చేస్తున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. అయితే అధికారులు మాత్రం బ్లాక్‌లను మూసివేసి ప్రధాన కాల్వ ద్వారా అవుకు రిజర్వాయర్‌కు నీటిని విడుదల చేస్తున్నారు. ఈ నీటిని బ్లాక్‌ల ద్వారా విడుదల చేసి మొక్కజొన్న సాగుకు నీరందించాలని రైతులు కోరుతున్నారు. గతేడాది మొక్కజొన్నకు గిట్టుబాటు ధర లభించి అధిక దిగుబడులు వచ్చాయి. దీంతో రైతులు ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఎస్సార్‌బీసీ అధికారులు వెంటనే అవసరమైన చర్యలు తీసుకోని బ్లాక్‌ల ద్వారా ఆయకట్టుకు సాగునీటిని అందించాల్సిన అవసరం ఉంది. గోరుకల్లు రిజర్వాయర్‌లో ప్రస్తుతం సుమారు 3 టీఎంల ఉన్నందున సాగునీటికి ఎటువంటి ఇబ్బంది ఉండదని రైతులు పేర్కొంటున్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్యాపిలి: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారిణి వాణిశ్రీ సూచించారు. మండల పరిధిలోని హెచ్‌ఆర్ పల్లి గ్రామంలో శనివారం గ్రామస్తులకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఈగలు, దోమలు వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఐదేళ్లలోపు పిల్లలకు నీళ్ల విరేచనాల బారిన పడితే వెంటనే వారికి హైడ్రేషన్ థెరపీలో భాగంగా ఓఆర్ఎస్ ద్రావణం తాగించాలన్నారు. బాధిత పిల్లలకు 14 రోజులు జింక్ మాత్రలు వేయాలన్నారు. వర్షాకాలంలో తాగునీరు కలుషితం కాకుండా చూసుకోవాలన్నారు. కాచి వడపోసిన నీటిని మాత్రమే తాగాలన్నారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది రాఘవేంద్రగౌడ్, గురుదేవి తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఆలయ, శిఖర ప్రతిష్ఠోత్సవాలు

వెలుగోడు: పట్టణంలోని విజయనగర్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన గణపతి ఆలయ, శిఖర ప్రతిష్ఠోత్సవాలు ఈనెల 12 నుంచి 14వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయం నిర్మాణ, వ్యవస్థాపక, శాశ్వత ధర్మకర్త రామాపురం శ్రీనివాసులు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ 12న సోమవారం ఉదయం గోపూజ, గంగపూజ, వరుణానయనం, యాగశాల ప్రవేశం, గణపతిపూజ, మహాసంకల్పం, పుణ్యాహవాచనం, నాంది, మాతృకా పూజనము, రక్షాబంధనం, పంచగవ్యప్రాశనం, దీక్షా కార్యక్రమం, సర్వతోభద్ర మంటప ఆరాధన, ప్రధాన కలశ స్థాపన, నవగ్రహ ఆవాహనము, జపానుష్ఠానములు, మహామంగళహారతి, తీర్థప్రసాదవితరణ, సాయంత్రం 6 గంటలకు మత్స్యంగ్రహణము, అంకురార్పణ, వాస్తుపూజ, ఆవాహనము, అగ్ని, ప్రతిస్థాపన, దీక్షాహోమము, పంచగవ్యాదివాసము, జలాధివాసము, వేదస్వస్తి, మహామంగళహారతి ఉంటుందన్నారు. 13న ఉదయం ప్రభాతపూజ, దీక్షాహోమం, గణపతిహోమం, మహాస్నపనము, రుద్రహోమము, లక్ష్మీగణపతి హోమము, సాయంత్రం 5 గంటలకు ప్రదోషపూజ, ధాన్యాదివాసము, శయ్యాదివాసము, పుష్పాది వాసము, సాయంవేద స్వస్తి, మహామంగళహారతి, తీర్థప్రసాద వితరణ ఉంటుందన్నారు. 14న ప్రభాతపూజ, ప్రతిష్ఠాంగ హోమాదులు, తదుపరి శ్రీ గణపతి, శిఖర, ధ్వజ యంత్ర ప్రతిష్టాపనం చేయనున్నట్లు చెప్పారు. భక్తులు పెద్ద ఎత్తున హాజరై వారి కృపకు పాత్రులు కాగలరని ఆయన కోరారు.

ఎస్పీని కలిసిన సీఐలు

బొమ్మలసత్రం: నంద్యాల వన్ టౌన్ సీఐగా బదిలీపై వచ్చిన రామకృష్ణ, బనగానపల్లె సీఐ తిమ్మారెడ్డి శనివారం జిల్లా ఎస్పీ కె.రఘువీర్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతపురం జిల్లా యాడికి పోలీ స్టేషన్ సర్కిల్ సీఐగా విధులు నిర్వర్తిస్తున్న రామకృష్ణను పోలీసు ఉన్నతాధికారులు నంద్యాల వన్‌టౌన్‌కు బదిలీ చేశారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఎస్పీని కలిశారు. అలాగే కర్నూలు వన్ టౌన్ సీఐగా విధులు నిర్వహిస్తున్న తిమ్మారెడ్డిని బనగానపల్లె సీఐగా బదిలీ చేశారు.

ఓంకారంలో భక్తుల సందడి

మహానంది: బండిఆత్మకూరు మండలం ఓంకారం పుణ్యక్షేత్రంలో వీకెండ్‌తో పాటు వివాహాలు జరగడంతో భక్తుల సందడి నెలకొంది. సుమారు పదికి పైగా వివాహాలు జరిగినట్లు ఆలయ అర్చకులు తెలిపారు. ఈ మేరకు భక్తులు, నూతన వధూవరులు శ్రీ ఓంకారసిద్ధేశ్వరస్వామిని దర్శించుకుని భక్తి శ్రద్ధలతో పూజలు చేపట్టారు. ఆలయ ప్రాంగణంలోని శ్రీ కాశిరెడ్డినాయన అన్నదాన భవనంలో అన్నప్రసాదాలు స్వీకరించారు. వేలాది సంఖ్యలో భక్తులు రావడంతో ఆలయ ప్రాంగణాలు కళకళలాడాయి.

రెండ్రోజుల్లో 40 మందికి జరిమానాలు

మహానంది: రెండ్రోజులు వాహనాల తనిఖీ నిర్వహించి 40 మందికి జరిమానాలు విధించినట్లు ఎస్ఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ నంద్యాల–గిద్దలూరు మార్గంలోని బోయిలకుంట్ల, నంద్యాల–మహానంది ర హదారిలోని సూర్యనంది సమీపంలో వాహనాల తనిఖీ నిర్వహించినట్లు చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రయాణిస్తున్న వారికి జరిమానాలు విధించినట్లు చెప్పారు. దీంతో పాటు బహిరంగంగా మద్యం తాగుతున్న ముగ్గురిపై కేసులు నమోదు చేసినట్లు ఆయన చెప్పారు.

యాజమాన్యాలు నిబంధనలు పాటించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఆర్‌ఓ పుల్లయ్య

బనగానపల్లెరూరల్: జిల్లాలో కొత్తగా ఏర్పాటు చేయు పరిశ్రమల యాజమాన్యాలు ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని డీఆర్‌ఓ పుల్లయ్య సూచించారు. మండలంలోని పలుకూరు గ్రామంలో సర్వే నంబరు 159/2లో 1.650 హెక్టార్లలో క్వారీ లీజు నిమిత్తం పారిశ్రామికవేత్త జి.వెంకటరామిరెడ్డి దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు శనివారం పర్యావరణ అనుమతి కోసం ప్రజాఅభిప్రాయ సేకరణ గ్రామ సభ జరిగింది. కార్యక్రమానికి హాజరైన డీఆర్‌ఓ పుల్లయ్య మాట్లాడుతూ కొత్తగా ఏర్పాటు చేస్తున్న మైనింగ్ పరిశ్రమలో స్థానికులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. పరిశ్రమ ఆవరణంలో మొక్కలు నాటి సంరక్షించాలని, సంస్థకు వచ్చే ఆదాయంలో కొంత మేర సామాజిక సేవ కార్యక్రమాలు, గ్రామంలో మౌలికవసతుల కల్పనకు వెచ్చించాలన్నారు. జిల్లా కలుష్య నియంత్రణ మండలి అధికారి మునిప్రతాప్ మాట్లాడుతూ మైనింగ్ చేయు సమయంలో వాయు, శబ్ద కాలుష్యం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పలువురు పర్యవరణవేత్తలు, గ్రామస్తులు తమ అభిప్రాయాలను గ్రామ సభలో వ్యక్తం చేశారు. గ్రామ సభ ద్వారా ప్రజల నుంచి స్వీకరించిన అభిప్రాయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లనున్నట్లు డీఆర్‌ఓ పుల్లయ్య, కాలుష్యనియంత్రణ మండలి అధికారి మునిప్రతాప్‌లు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి దొరబాబురెడ్డి, రెవెన్యూ అధికారులు, నందివర్గం ఎస్ఐ రామాంజనేయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

13 నుంచి అంతర్జాతీయ యోగా వారోత్సవాలు



మాట్లాడుతున్న గీతా యోగాసన సంఘం గురూజీ రాం పుల్లయ్య

డోన్ : అంతర్జాతీయ యోగా వారోత్సవాలను 13 నుంచి 18వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు గీతా యోగాసన సంఘం వ్యవస్థాపకులు గురూజీ రామ్ పుల్లయ్య తెలిపారు. స్థానిక సంఘం కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. యోగాపై ప్రజలను చైతన్య పరిచేందుకు ఆదివారం చేపట్టే ర్యాలీని డీఎస్పీ శ్రీనివాసులు ప్రారంభిస్తారన్నారు. వారోత్సవాల్లో భాగంగా రక్తదాన శిబిరం, అన్నదానం, మొక్కలు నాటే కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. విద్యార్థులకు యోగా పట్ల ఆసక్తి పెంపొందించేందుకు అనేక కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. 18వ తేదీన ప్రముఖ ఆధ్యాత్మిక ప్రబోధకులు బ్రహ్మశ్రీ గరికపాటి నరసింహారావు కుమారుడు గరికపాటి గురజాడచే ప్రవచనాల కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇదే రోజు ముగింపు సమావేశానికి సీనియర్ సివిల్ జడ్జి తంగమణి, మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ ముఖ్య అతిథులుగా హాజరు అవుతున్నారన్నారు. గీతా యోగాసన సంఘం అధ్యక్షుడు సప్తశైల తిమ్మయ్య, కార్యదర్శి గోంట్ల శేషఫణి ఆధ్వర్యంలో జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో న్యాయవాదులు నాగభూషణంరెడ్డి, శ్రీరాములు, సభ్యులు మాకం బాలు, సంగాల సాయి బాబ, పెద్దయ్య, రంగస్వామి, సముద్రాల బాలు హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

కొలనుభారతీ అమ్మవారికి ప్రత్యేక పూజలు



సాముహిక అక్షరాభ్యాసాలు చేస్తున్న దృశ్యం

కొత్తపల్లి: మండలంలోని శివపురం గ్రామసమీపంలో ఉన్న నల్లమల అటవీప్రాంతంలో వెలసిన కొలనుభారతి క్షేత్రంలో అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పురోహితులు ప్రాతఃకాలం నుంచి అమ్మవారి మూలవిరాట్‌ను పూలమాలలతో అలంకరించారు. అభిషేకం, కుంకుమార్చన, పుష్పార్చన తదితర పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారికి కాయ, కర్పూరం సమర్పించారు. అనంతరం చిన్నారులతో పురోహితులు అక్షరాభ్యాసం చేయించారు.

కాంట్రాక్టు అధ్యాపకులకు మంచిరోజులు!

- ఉమ్మడి కర్నూలు జిల్లాలో 320 మంది అధ్యాపకుల ఉద్యోగాలు రెగ్యులర్
- సీఎం వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డికి అభినందనలు



బనగానపల్లె ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విధులు నిర్వర్తిస్తున్న కాంట్రాక్ట్ లెక్చరర్ (ఫైల్)

బనగానపల్లె: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కాంట్రాక్ట్ ఉద్యోగులకు అండగా నిలిచింది. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ చేపట్టారు. కాంట్రాక్ట్ ఉద్యోగులకు మంచిరోజులు వచ్చాయి. ఏళ్లతరబడి నిరీక్షణ నెరవేరింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు వర్తించే అన్నిసదుపాయాలు అమలవుతుండడంతో ఉమ్మడి కర్నూలు జిల్లాల్లో సుమారు 42 ప్రభుత్వ కళాశాలల్లో పనిచేస్తున్న 320 మంది అధ్యాపకుల కుటుంబాలు ఆనందం వ్యక్తం చేస్తున్నాయి. విద్యాబుద్ధులు నేర్పించి విద్యార్థులను ఉన్నతవంతులుగా తీర్చిదిద్దాలన్న ఆశయంతో ఉద్యోగంలో చేరిన కాంట్రాక్టు అధ్యాపకులకు గత ప్రభుత్వాలు నెలకు రూ.18వేల అరకొర జీతాలతో ఏడాదికి పది నెలలు మాత్రమే చెల్లించేవి. పర్మినెంట్ చేయాలని ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా అన్ని సదుపాయలు కల్పించాలని కాంట్రాక్టు అధ్యాపకులు ఎంతో కాలంగా పోరాటం చేస్తూనే ఉన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లడంతో విద్యారంగానికి ప్రాధాన్యనిస్తూ కాంట్రాక్టు అధ్యాపకుల వేతనాలను రూ.37,100 పెంచారు. గతేడాది జనవరిలో పీఆర్‌సీ పెంచడంతో వీరికి ఒకే సారి రూ.20వేల వేతనం పెరిగింది. దీంతో ప్రస్తుతం అధ్యాపకులకు నెలకు రూ.57,100 అందుకుంటున్నారు. అలాగే ఏడాదంతా పూర్తిగా జీతం ఇచ్చే విధంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది ప్రభుత్వం. అదేవిధంగా 2014 జూన్ 2వ తేదీ నాటికి ఐదేళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న ఉద్యోగులను క్రమబద్ధీకరించడంతో కాంట్రాక్టుకు అధ్యాపకులకు మంచి రోజులు వచ్చాయి. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాజాగా తీసుకున్న నిర్ణయం పట్ల హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

సీఎంకు రుణపడి ఉంటాం



ప్రభుత్వ జూనియర్ కళాశాలల కాంట్రాక్టు అధ్యాపకులు క్రమబద్ధీకరణ ఎంతో ఆనందదాయకం. గతంలో రూ.18వేల జీతాలకే పని చేసిన అధ్యాపకులకు సీఎం వైఎస్ జగన్ వేతనాలు పెంచడంతో పాటు క్రమబద్ధీకరించడంతో అనేక సదుపాయాలు వర్తించనున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా కాంట్రాక్టు అధ్యాపకులు ప్రభుత్వానికి రుణపడి ఉంటారు.

– కిశోర్‌కుమార్, జిల్లా కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం ప్రధాన కార్యదర్శి

క్రమబద్ధీకరణ ఆనందదాయకం



గతంలో నెలకు కేవలం రూ.18వేలవేతానానికే పని చేశా. ప్రభుత్వాలు మరినా వేతనాలు పెరగక ఆర్థిక ఇబ్బందులతో సతమతమయ్యాం. జగన్‌మోహన్ రెడ్డి సీఎం అయ్యాక వేతనం రూ,57,100 పెంచడంతో ఆర్థిక ఇబ్బందులు తొలగాయి. తాజాగా కాంట్రాక్ట్ ఉద్యోగాలు క్రమబద్ధీకరిస్తూ తీసుకున్న నిర్ణయం అనందదాయకం.

– ఎంఎల్ నాగేశ్వరరెడ్డి, కామర్స్ అధ్యాపకులు, బనగానపల్లె

హామీని నెరవేర్చిన సీఎం



పాదయాత్ర సందర్భంగా మా సమస్యలు గుర్తించిన నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. ఎన్నికల మేనిఫెస్టోలోను పెట్టిన విధంగా అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం వైఎస్ జగన్ ఇచ్చిన హామీ నెరవేర్చారు. వేతనంపెరగడంతో పాటు ఏడాదంత పూర్తిగా జీతం ఇచ్చే విధంగా ఇచ్చారు. ఇప్పుడు క్రమబద్ధీకరణ చేసి సంపూర్ణంగా న్యాయం చేశారు. సీఎం సాయం మరువం.

– కె.వీరన్న చరిత్ర అధ్యాకుడు, బనగానపల్లె

దరఖాస్తు చేసుకోండి

జూపాడుబంగ్లా: విద్యావంతులైన రైతులు అగ్రికల్చర్ డ్రోన్ల కోసం దరఖాస్తు చేసుకోవవాలని మండల వ్యవసాయ అధికారి కృష్ణారెడ్డి తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఐదుగురు రైతులు గ్రూపుగా ఏర్పడితే రూ.10 లక్షల విలువైన డ్రోన్ల కొనుగోలుకు రూ.40 శాతం రాయితీతో పాటు బ్యాంకు రుణం మంజూరు చేయనున్నట్లు తెలిపారు. గ్రూపులో అగ్రికల్చర్ విద్యను అభ్యసించినవారుంటే రూ.10 లక్షల డ్రోన్ల కొనుగోలుకు 50 శాతం రాయితీతో పాటు రూ.5 లక్షల వరకు బ్యాంకు రుణం మంజూరు చేయనున్నట్లు తెలిపారు. గ్రూపులో ఇంటర్, డిగ్రీ విద్యను అభ్యసించిన వారికి ప్రభుత్వమే ఉచితంగా శిక్షణను ఇచ్చి వారికి డ్రోన్‌పైలెట్ సర్టిఫికెట్ మంజూరు చేస్తుందన్నారు. తద్వారా గ్రామాల్లో డ్రోన్లను వినియోగించుకోవటం సులభమవుతుందన్నారు.



కుందూనదిపై ఇంద్రధనస్సు కనువిందు!

వేసవి నేపథ్యంలో శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండతీవ్రత అధికంగా ఉంది. ప్రజలు ఉక్కపోతతో అల్లాడిపోయారు. సాయంత్రం ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకుంది. వాతావరణం చల్లబడింది. ఆకాశం మేఘావృతమై ఇంద్రధనస్సు ఏర్పడింది. కోవెలకుంట్ల పట్టణ శివారులోని కుందూనదిపై ఇంద్రధనస్సు కనువిందు చేసింది. ఈ దృశ్యం అటుగా వెళ్తున్న ప్రయాణికులకు కనువిందు చేసింది.

– కోవెలకుంట్ల